తాళ్వాయిపాడు గ్రామం వద్ద నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి (ఫైల్)



తాళ్వాయిపాడు వద్ద యంత్రాలతో ఇళ్లు తొలగిస్తున్న అధికారులు (ఫైల్)




పరిహారం.. పరిహాసం

ఆరులేన్ల జాతీయ రహదారికి ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు ఇచ్చే పరిహారం పరిహాసంగా మారింది. పదేళ్ల క్రితం రూ.15 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఇళ్లకూ రూ.5 లక్షలు చెల్లిస్తామని నోటీసులు జారీ చేశారు. అది కూడా నాలుగేళ్లయినా అందలేదు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అధికారులను కలిసి గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేదు. పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యమని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

- నాలుగేళ్లుగా అందని పరిహారం
- గగ్గోలు పెడుతున్న నిర్వాసితులు
- పట్టించుకోని అధికారులు

పెళ్లకూరు : రేణిగుంట-నాయుడుపేట ప్రాంతాలను కలుపుతూ సుమారు 57 కిలోమీటర్లు పొడవున రూ.2,200 కోట్లతో ఆరులేన్ల రోడ్డు విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా పెళ్లకూరు మండలంలో చిల్లకూరు, తాళ్వాయిపాడు, చెంబడిపాళెం, ఎగువచావలి గ్రామాల్లో పలువురి నుంచి ఇళ్లు తొలగించారు. మరికొందరి భూములు తీసుకున్నారు. అధికారులు సర్వే పనులను సక్రమంగా చేపట్టకపోవడం, నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేయకపోవడంతో బాధితులకు తిప్పలు తప్పడం లేదు. సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల విలువ చేసే ఇళ్లకు రూ.5 లక్షలు పరిహారం చెల్లిస్తామంటూ నోటీసులు ఇచ్చారు. ఆ పరిహారం తమకు చాలదని, మరికొంత పెంచాలని బాధితులు లబోదిబోమంటున్నా పట్టించుకోవడం లేదు. ఆర్డీవో కిరణ్మయి ఇటీవల పలు గ్రామాల్లో పోలీసుల బందోబస్తు మధ్య తమ సిబ్బందితో కలిసి ఇళ్ల తొలగింపునకు మెగా ఇన్‌ఫ్రా కంపెనీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. వారిపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే చిల్లకూరు గ్రామానికి చెందిన సాగి దశరథయ్య ఇల్లు పూర్తిగా రోడ్డుకు పోతోంది. అతనికి రూ.5.43 లక్షలు చెల్లించేలా అవార్డు నోటీసు అందజేసి ఖాతాలో నగదు జమ చేశారు. దశరథయ్య ఇంట్లో ఎనిమిది మంది నివాసం ఉంటున్నారు. సుమారు రూ.20 లక్షల విలువైన ఇంటికి రూ.5.43 లక్షలు చెల్లించి ఇల్లు తొలగిస్తామంటే తమకు చావే శరణ్యమని దశరదథ భార్య రత్నమ్మ అధికారుల ముందు వాపోయారు. అలాగే అదే గ్రామానికి చెందిన వంకపూరి రమణమూర్తి వ్యవసాయ భూమిలో రోడ్డు వేసుకొని రూ.2.85 లక్షల పరిహారం చెల్లిస్తామంటూ అవార్డు నోటీసు ఇచ్చారు. నాలుగేళ్లు అవుతున్నా ఒక్క పైసా కూడా చెల్లించలేదు. పలుమార్లు కలెక్టరేట్‌కు తిరిగినా ఫలితం లేదు. అదే గ్రామానికి చెందిన వంకపూరి మస్తానయ్య, మెరియం సుబ్బారావు, మెరియం కుమార్, తిరుపాలయ్య, గురవయ్య, సంపూర్ణమ, లక్ష్మమ్మ, సుబ్బరామయ్య తదితరులు పరిహారం కోసం విన్నవించినా ఫలితం లేదు. పరిహారం చెల్లించేంత వరకు ఇళ్లు తొలగిస్తే ఊరుకోమని, ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడమని కొందరు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిర్వాసితునికి అందించిన అవార్డు నోటీసు



చిల్లకూరులో ఉన్న సాగి దశరథయ్య ఇల్లు

చావు తప్ప మరో మార్గం లేదు



వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. రోడ్డు విస్తరణతో ఇల్లు పోతుందని, పరిహారం కింద రూ.5 లక్షలు చెల్లిస్తామని అవార్డు నోటీసు ఇచ్చారు. పదేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. రూ.5 లక్షలు ఇచ్చి ఇల్లు తొలగిస్తామంటే మేము ఎవరికి చెప్పుకోవాలి. మాకు పూర్తి స్థాయి పరిహారం చెల్లించకుంటే చావు తప్ప మరో మార్గం లేదు.
- సాగి రత్నమ్మ, చిల్లకూరు

పరిహారం చెల్లించేలా చర్యలు

జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేని నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదు. వాటిని కూడా పూర్తి స్థాయిలో పరిశీలించి త్వరలో పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.
- కిరణ్మయి, సూళ్లూరుపేట ఆర్డీవో

2025లో వాకాడులో జాతీయ తెలుగు సాయిభక్త సమ్మేళనం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంతర్జాతీయ షిరిడీ సాయిభక్త సేవా ట్రస్టు ప్రతినిధులు

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులో 2025 జూన్ 6, 7, 8 తేదీల్లో జాతీయ స్థాయిలో తెలుగు సాయిభక్త సమ్మేళనం నిర్వహించనున్నట్టు అంతర్జాతీయ షిరిడీసాయి భక్త సేవా ట్రస్టు చైర్మన్ ఎస్ఎల్ నరసింహారావు తెలిపారు. ఆయన శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల మహారాష్ట్రలోని షిరిడీ గ్రామంలో అంతర్జాతీయ సమ్మేళనం నిర్వహించామన్నారు. జాతీయ స్థాయిలో వాకాడులో నిర్వహించనున్న సాయిభక్త సమ్మేళనంలో 1200 మంది సాయి ఉపన్యాస గురువులు, మరో 3 వేల మంది భక్తులు పాల్గొననున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మి, హైదరాబాద్ కన్వీనర్, సభ్యురాలు కె.పద్మ, ఎస్.పద్మ, తిరుపతి జిల్లా కన్వీనర్ కె విజయలక్ష్మి, కోఆర్డినేటర్లు సురేష్ రెడ్డి, కొండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలు వేయొద్దు



వ్యర్థాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు : పోర్టు నుంచి తీసుకుని వచ్చి వ్యర్థాలను కడివేడు గ్రామ సమీపంలోని చెరువు ప్రాంతంలో వేయడంపై తహసీల్దార్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడివేడు, తిమ్మనగారిపాళెం, కమ్మవారిపాళెం గ్రామాల రైతులు, రైతు సంఘం నాయకులతో కలిసి రెండు రోజులు క్రితం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతి పత్రం అందజేశారు. కొంతమంది పోర్టు నుంచి వచ్చే వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తీసుకుని వచ్చి కడివేడు చెరువు వద్ద వదలేస్తున్నారని, వేస్టు ఆయిల్‌ను వేస్తుండడంతో నీరు కలుషితం అవుతోందని పేర్కొన్నారు. ఆ నీటిని తాగిన పశువులు, వన్య ప్రాణులు మృతి చెందుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సబ్‌కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్, వీఆర్వో బాలాజీ చెరువు వద్దకు చేరుకుని వ్యర్థాలను పరిశీలించారు. అనంతరం వాటిని అక్కడ వదులుతున్న వారిని పిలిపించి తొలగించాలని సూచించారు. మరోసారి వ్యర్థాలను వేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వేలంపాటలను అడ్డుకున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట రూరల్ : పచ్చనేతల దౌర్జన్యం ఆగడం లేదు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వేలం పాటలను కూడా అడ్డుకున్నారు. మండలంలోని తోటకట్ల గ్రామంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆలయ ఈవో మమత, పోలీసుల సమక్షంలో శుక్రవారం గ్రామానికి వెళ్లి వేలం పాటలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అక్కడున్న టీడీపీ నాయకులు వేలం పాటలు జరగకుండా అధికారులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వేలంపాటలు నిర్వహించకుండానే టీడీపీ నాయకులకు ఆలయ భూములు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారని, ఇందులో భాగంగానే వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే శిథిలావస్థకు చేరుకున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణం దేవదాయ శాఖ సమక్షంలో నిర్వహించాల్సి ఉన్నా టీడీపీ నేతలు చేపట్టడంపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆలయ ఈవో మమత వివరణ ఇస్తూ వేలం పాటలు జరగకుండా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారని తెలిపారు. దేవదాయశాఖ సమక్షంలోనే ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిజేయస్తామన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు



చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరు జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. చిల్లకూరు పంచాయతీని గూడూరు మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ట్యాంకు వాడకాన్ని నిలిపివేశారు. దీంతో శిథిలావస్థకు చేరింది. నిత్యం క్రీడలు ఆడుకునే విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. దీన్ని తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు చెబుతున్నారు. విద్యార్థులు ఆటలు ఆడే సమయంలో ఎక్కడ కూలుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంకును తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పక్కాగా నైపుణ్య గణన

సైదాపురం: నైపుణ్య గణన సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ కోరారు. ఆయన శుక్రవారం చాగణం రాజుపాళెంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల లోపు వారి విద్యార్హతలు, వారికి ఏరంగంపై మక్కువ ఉంది తదితర వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాపూరు/సూళ్లూరుపేట/వెంకటగిరి రూరల్/ నాయుడుపేట టౌన్ : రాపూరులోని విద్యుత్ సబ్ స్టేషన్, సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారు పోలూరులోని 220 కేవీ, వెంకటగిరిలోని పాలకేంద్రం 132 కేవీ, నాయుడుపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు, వట్రపాళెం, సాయినగర్, రైల్వేస్టేషన్ ఏరియా, సూళ్లూరు, జీఎస్‌టీ రోడ్డు, వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి, నాయుడుపేట మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారు లు ఈ విషయాలను గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఘనంగా కోటి సోమవారం



నోములు నోచుకుంటున్న భక్తులు

రాపూరు: కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారాన్ని పురస్కరించుకుని రాపూరులోని పురాతన రామనాథేశ్వర స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకు మార్చనసేవ పూలంగి సేవ చేపట్టారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. మరి కొందరు నోములు నోచుకున్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

దక్కిలి: మండలంలోని నడింపల్లి, డి.ఉప్పరపల్లి (గొల్లపల్లి) గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఈవో కె.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. విద్యలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన్నా పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. హెచ్‌ఎంలు టి.శ్రీనివాసులు, వేణుగోపాల్, ఉపాధ్యాయురాలు ఎం అన్నపూర్ణ పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో ఉన్న వళ్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో స్కంధ షష్టి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. తారకాసుర సంహారం జరిగిన తర్వాత సుబ్రమణ్యేశ్వర స్వామికి దేవేంద్రుడి కుమార్తె దేవసేనతో జరిపిన కల్యాణ ఘట్టాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేపట్టి ప్రత్యేక హోమాలు చేశారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో రాత్రి స్వామి వారి నగరోత్సవం నిర్వహించారు.

ఆధునిక పద్ధతులతో పంటలు సాగుచేయాలి



మాట్లాడుతున్న ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య

వెంకటగిరి రూరల్ : మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేసేలా అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరి డివిజన్ పరిధిలోని వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వృత్తినైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలన్నారు. పంటల సాగు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నిమ్మపంటలో చీడపీడల తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తులు, మెళకులవలను వివరించారు. ఏవోలు శిరీష, భారతి, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





మృతి చెందిన వెంకటరమణయ్య (ఇన్‌సెట్) వెంకటరమణయ్య(ఫైల్)

చిల్లకూరు: మండలంలోని బూదనం సమీపంలోని చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఓజిలి మండలం పెదపరియ గ్రామానికి చెందిన శ్రీరాం వెంకటరమణయ్య(44) దుకాణం నడుపుకుంటున్నాడు. అంగడికి వస్తువులు తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి గూడూరుకు బైక్‌పై బయలుదేరాడు. బూదనం సమీపంలో ముందు వెళ్తున్న ఆటో అకస్మాత్తుగా పక్కకు తిరిగింది. దానిని తప్పించబోయి ఢీకొని పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో అతని వెనుక బైక్‌లో వస్తున్న ఇద్దరు యువకులు కూడా ప్రమాదం జరిగిన బైక్‌ను ఢీకొని బోల్తాపడ్డారు. వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. గూడూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం గూడూరు నుంచి ఆర్మేనిపాడు గ్రామానికి చేరుకుంది. బస్టాండ్‌లో డ్రైవర్ బస్సును రివర్స్ చేస్తుండగా.. వివేకానంద విగ్రహం వద్ద గుంటమడుగు దేవరాజు(65)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఓజిలి ఏఎస్ఐ గురుమూర్తి, హెచ్‌సీ రమేష్ వివరాలు నమోదు చేశారు. అతన్ని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎట్టకేలకు స్థల వివాదం పరిష్కారం



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: మండలంలోని చింతపూడి పంచాయతీ యాలకారికండ్రిగ గ్రామంలో సుబ్రమణ్యంనాయుడు, సుధాకర్‌నాయుడు మధ్య నెలకొన్న ఇంటి స్థల వివాదం శుక్రవారం పరిష్కారమైంది. స్థలాన్ని శుక్రవారం తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇరు కుటుంబాల వారితో మాట్లాడి సర్దుబాటు చేశారు. భవిష్యత్తులో ఇరువురి మధ్య మరోసారి వివాదం తలెత్తకుండా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. వారి వెంట వీఆర్వోలు కళ్యాణి, వంశీ, సర్వేయర్ సూర్య తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

సైదాపురం : మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా చేస్తున్నట్టు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సైదాపురం, తిప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్: మేనకూరు సెజ్‌లో లాకౌట్ ప్రకటించిన లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ వద్ద కార్మికులు శుక్రవారం కూడా ఆందోళనలు చేపట్టారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం నోటీసులు ఇవ్వకుండా పరిశ్రమను మూసివేయడం దారుణమని పేర్కొన్నారు. కార్మికులకు చట్టపరంగా రావాల్సిన రాయితీలు ఇవ్వకుండా మిషనరీలను చెన్నైకి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే మిషనరీ తరలించాలని భీష్మించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, కార్మిక సంఘం మహిళా నాయకులు రత్నమ్మ, దీప, శివ, సుమతి, మణి, లావణ్య వాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థి బాలాజీ అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని శుక్రవారం అభినందించారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలో ఉన్న కరుణ నిలయంలో శుక్రవారం పేదలకు బాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ కరుణ కృపాదానమ్మ జ్ఞాపకార్థం పేదలకు ఆహారం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భావన, బ్రదర్, బాబ్జీ, ఈద్గా, యూత్ సభ్యులు షబ్బీర్, ఖాదర్‌బాషా, యస్తానీ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 50.025 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 50.025 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,000, పిన్నేరు కాలువకు 60, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్ష సాధింపులు

కోట : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్ష సాధింపులు తగవని కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల ఒత్తిళ్లతో మండలంలో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. బాధితులు కోర్టును ఆశ్రయించడంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. చట్ట విరుద్ధంగా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగానే మండలంలోని కొత్తపట్నం, కోట, జరుగుమల్లి ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎంపీడీవో వేణు, ఉపాధిహామీ ఏపీడీ వరప్రసాద్, ఏపీవో పూర్ణిమ శుక్రవారం విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు సమాచారం.

ఘనంగా రుద్రాభిషేకం

చిట్టమూరు(వాకాడు) : చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన కామాక్షి దేవి సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కోటి సోమవారం పర్వదినం సందర్భంగా విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్ శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అలాగే కామాక్షి దేవికి లలితా సహస్రామార్చన, ఉసిరి చెట్టు కింద సాలగ్రామ అభిషేకాలు, వన భోజన కార్యక్రమాలు నిర్వహించారు.

పోస్టల్ బ్యాంకు ఖాతాల కోసం ప్రత్యేక శిబిరాలు

సూళ్లూరుపేట : ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌లో కొత్త ఖాతాలు తెరవడం, ఆధార్ లింకేజీ కోసం గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఈ నెల 15 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు సూళ్లూరుపేట పోస్టల్ అధికారి టి.షణ్ముఖ్ తెలియజేశారు. కొత్త ఐపీపీబీలు తెరవడంతోపాటు ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ లింక్ చేస్తామన్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్‌ను సులభతరం చేయడం తమ ప్రాథమిక లక్ష్యమని తెలియజేశారు.

గ్రామదేవతకు పొంగళ్లు

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులో వెలసిన గ్రామదేవత వేమాలమ్మకు శుక్రవారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించినట్టు గ్రామస్తులు తెలిపారు.